


కోర్టు హాలంతా అక్కడక్కడ జనంతో నిండిపోయింది.

గోడగడియారం పదిగంటలు కొట్టింది.

జడ్జిగారి రాకతో అప్పటివరకూ సాగిన అల్లరి సద్దుమణిగింది.

జడ్జిగారు ఆసీనులవుతూ కోర్టునంతా పరిశీలనగా చూశారు.

జడ్జిగారి వెనక గోడకు తగిలించిన ఫోటోలో మహాత్మాగాంధీ నవ్వుతూ అందరినీ పలకరిస్తున్నట్టుగా వున్నారు.

మరికొన్ని క్షణాల్లో ముద్దాయిగా పేర్కొనబడిన లక్ష్మి బోనులో కొచ్చి నిలుచుంది. ఆవిడ కిరువైపులా ఇద్దరు పోలీసులు కాపలా కాస్తున్నారు.

లక్ష్మి మెడచుట్టూ కొంగును లాక్కుంటూ- ఇటువైపే చూస్తున్న తన బాబును చూసింది. కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరుగుతుంటే బలవంతంగా ఆపుకుంది.

ప్రమాణం చేయడం పూర్తికాగానే- పబ్లిక్ ప్రాసిక్యూటర్ నల్లని కోటును

సవరించుకుంటూ బోను దగ్గరగా వచ్చాడు

శూన్య దృక్కులతో నిలుచున్న లక్ష్మి పబ్లిక్ ప్రాసిక్యూటర్ వైపు దృష్టి సారించింది

"మీ పేరు ?"

"లక్ష్మి"

"ఏం చేస్తుంటారు ?"

"ఉద్యోగం।"

"పెళ్ళయిందా ?"

"అయింది"

"మీ భర్త ఏం చేస్తుంటారు ?"

"తెలియదు"

"అంతే ?"

"అతను నాకు దూరమై సంవత్సరం కావస్తుంది"

"ఎందుకు దూరమయ్యారు ?" పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రశ్నకు చిన్నగా నవ్వింది లక్ష్మి

"మగవాళ్ళు, ఆడవాళ్ళ కెందుకు దూరమవుతారు ?" ఎదురు ప్రశ్నించింది

"ప్రశ్నకు ప్రశ్న జవాబుకాదు నే నడుగుతున్నది మీ భర్త మీ కెందుకు దూరమయ్యారని అందరి గురించి కాదు ?"

"నే చెబుతున్నదీ అదే! నా మీద లేని అపనింద మోపి మగవాడిననే అహంకారంతో నాకు దూరమయ్యారు! మగవాడి ఆసరా లేకుండా ఆడది బ్రతక లేదనే ధీమాతో నన్ను వదలి వెళ్లారు." వ్యక్రోషంగా వున్నాయి లక్ష్మి మాటలు.

విచారిస్తున్న కేసుకు, ఈ వివరాలు అనవసర మనిపించింది జడ్జిగారికి

"మిస్టర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్!.. మనం విచారిస్తున్న కేసుగురించిన ప్రశ్నలు మాత్రమే అడగండి వారి వ్యక్తిగత జీవితంతో ఈ కేసుకు అంతగా సంబంధం లేదనుకుంటాను।"

"నో యువరానర్ । ఈ కేసుకూ ముద్దాయి వ్యక్తిగత జీవితానికీ చాలా సంబంధముంది ముద్దాయి ప్రవర్తన ఎలాంటిదో తెలుసుకోవడం చాలా అవసరమని కోర్టువారికి మనవి చేసుకుంటున్నాను"

'దెన్ ప్రొసీడ్।"

"థ్యాంక్యూ, యువరానర్ ।" అంటూ మళ్ళీ ముద్దాయివైపు తిరిగి "లక్ష్మిగారూ। మీ ప్రవర్తనమీద నమ్మకం లేకనే కదూ మీ భర్త మీకు దూరమయ్యారు !" అంటూ ప్రశ్నించాడు

"అవును । కానీ, నిజానికి నే నలాంటిదాన్ని కాను।"

"ఆ విషయం మీ భర్తతో ఎందుకు చెప్పలేదు ?"

"చెప్పాను । కానీ వినిపించుకో లేదు।"

"ఎందుకు ?"

"అందరిలా నేను ప్రాధేయపడనందుకు."

''అంటే.... చేసిన తప్పును ఒప్పుకున్నట్లేగా!''

''లేదు! తప్పు చేసినవారు పాధేయపడతారు!.... నేను ఏ తప్పు చేయలేదు కనుకే వారిని ప్రాధేయపడలేదు.''

"కాదు! భర్త లేకపోయినా, తోడుగా మరో మగవాడున్నాడనే ధైర్యంతోనే. ''

''నొ.... నొ.... నేనలాంటిదాన్ని కాను....'' పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాటలను మధ్యలోనే త్రుంచివేస్తూ- ఆవేశంతో అరచినంత పనిచేసింది లక్ష్మి.

ప్రేక్షకుల్లో కలకలం బయలుదేరింది.

"ఆర్డర్! ఆర్డర్!...." జడ్జిగారి మందలింపుతో తిరిగి నిశ్శబ్దం ఆవరించింది.

''చూడండి లక్ష్మిగారూ!.... మీకు మంగతాయారుగారు తెలుసా?.... ''

ప్రేక్షకుల్లో, ముందువరసలో కూర్చున్న వ్యక్తిని చూపిస్తూ ప్రశ్నించారు పబ్లిక్ ప్రాసిక్యూటర్!

''తెలుసు!''.... అసహ్యంగా తాయారు వైపు చూస్తూ అంది లక్ష్మి.

"ఎలా తెలుసు?''

"నేను వాళ్ళింట్లోనే అద్దెకున్నాను."

''ఎన్నాళ్ళనుంచి?''

"మూడు సంవత్సరాలనుంచి ''

"ఇప్పుడూ అక్కడే వుంటున్నారా?"

''లేదు! నెలరోజుల క్రితమే ఖాళీ చేశాను."

"ఎందుకు ఖాళీ చేశారు?''

''నా కిష్టంలేక!''

"అబద్ధం!''

"కాదు.... నిజం.''

"ఏది నిజం?.... ఆ ఇల్లు ఖాళీ చేయమని ఒక సంవత్సరం నుంచి మంగతాయారుగారు మిమ్మల్ని అడుగుతూనే వున్నారు."

"కానీ, ఆవిడ భర్తగారు వీల్లేదన్నారు!"

"కారణం?''

"మీ రూహించిన కారణం మాత్రం కాదు."

"పోనీ, మీ రూహించిన కారణమేమిటో చెబుతారా?"

"ఊహించిన కారణం చెప్పడానికి నేను మీలా లాయరును కాను "

"కానీ, ముద్దాయిగా మాత్రం మీరు నిజమే చెబుతారని నమ్మకమేమిటి?" సీరియస్‌గా అడిగారు పబ్లిక్ ప్రాసిక్యూటర్.

"మన్నించాలి! దేవుడిమీద మీకు భక్తి లేకపోవచ్చు. కానీ నాకుంది!.... పవిత్రమైన భగవద్గీత మీద ప్రమాణం చేసింది అబద్ధం చెప్పడానికి కాదని మీరు గ్రహిస్తారనుకుంటాను!...." మామూలుగా వెలువడిన లక్ష్మి మాటలకు కోర్టు హాలంతా గొల్లుమంది.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ పట్టుబడిన వాడిలా ఇబ్బందిగా చూశాడు.

జడ్జిగారి జోక్యంతో పరిస్థితి యథా స్థితికి చేరుకుంది.

"చూడండి లక్ష్మిగారూ! మీ తరఫున లాయరు నెవరినైనా నియమించారా?" జడ్జిగారి ప్రశ్న.

"నో, మిలార్డ్!.... అంతటి స్థోమత నాకు లేదు. కానీ నేను జరిగిన విష యాన్ని చెప్పడం ఇక్కడ నిషేధమా?"

"అలాంటిదేమీ లేదు. న్యాయమనేది వన్ వే ట్రాఫిక్ కాదు. వాద, ప్రతివాద నలు విన్న తరువాతే తీర్పు ఇవ్వడం జరుగుతుంది. మీరు చెప్పదలచుకున్న దేమిటో నిర్భయంగా చెప్పొచ్చు!...." కళ్ళజోడు సవరించుకుంటూ అన్నారు జడ్జిగారు.

"థాంక్యూ మిలార్డ్! థాంక్యూ..." కన్నీళ్ళు తుడుచుకుంటూ చెప్పడం ప్రారంభించింది లక్ష్మి.

"మాది లవ్ మ్యారేజ్! ఇద్దరమూ వుద్యోగస్థులమే! మొదట్లో ఇద్దరమూ ఎంతో అన్యోన్యంగా వుండేవాళ్ళం! రంగారావుగారూ, నేనూ ఒకే ఆఫీసులో పనిచేసేవాళ్ళం! పెళ్ళయిన కొత్తలోనే రావుగారి ఇంట్లో అద్దెకు చేరాము! మొదట్లో మంగతాయారుగారు మాతో ఎంతో చనువుగా వుండేవారు! కానీ సంవత్సరం తిరక్కముందే నన్ను చూస్తేనే ముఖం చిట్లించుకునేవారు! కారణం తెలియదు! అనుకోకుండా మావారికి గుంటూరు ట్రాన్స్‌ఫర్ అయింది! నన్ను కూడా రమ్మన్నారు! కానీ వుద్యోగం వదిలి రానన్నాను! 'నీకు డబ్బు ముఖ్యమో, నేను ముఖ్యమో ఆలోచించుకో....' మని హెచ్చరించారు మావారు! నాలో అభిమానం దెబ్బ తింది!.... అహం తలెత్తింది! నేను ససేమిరా రానన్నాను! అదే నాకు శాపంగా పరిణమించింది! మగవారి అసరా లేకుండా బ్రతగ్గలనని నిరూ పిద్దామనుకున్న నాలో నైరాశ్యం చోటు చేసుకుంది! నేను తల్లిని కాబోతున్నా నని తెలిసి కూడా నన్ను శాశ్వతంగా దూరంచేశారు మావారు! అప్పుడు నేనెంతో చిత్రవధ ననుభవించాను! అయినా సాటి స్త్రీగా మంగతాయారు గారు నాకు ధైర్యం చెప్పలేదు, సరికదా నన్ను మరింత హేళనచేసారు. 'మొగుడ్ని వదిలిపెట్టిన ముండ....' అంటూ నన్ను అసహ్యించుకున్నారు! రావుగారి మంచి తనంవల్ల నాలో వుప్పెనలా పొంగే కోపానికి అనకట్ట వేసేదాన్ని!

....ఆ తరువాత ఇల్లు ఖాళీచేయ మని మంగతాయారుగారు నన్నడిగారు! కానీ వున్నపళంగా మరో ఇల్లు దొరకడ మంటే కష్టంగా వుంటుందని చెప్పాను! అదీగాక నెలలు నిండని పసివాడితో క్రొత్తచోట ఎలా వుండగల నని అభ్యర్థించాను! కానీ సాటి స్త్రీగా

ఆవిడ నా బాధను అర్థంచేసుకోలేదు! నన్ను అవహేళన చేసారు! ఆవిడ భర్త రంగారావుగారు నా కష్టాలను గ్రహించి నన్ను అదే ఇంట్లో వుండ నిచ్చారు! మంచి మనసుతో వారు చేసిన సహాయాన్ని మంగతాయారుగారు అపార్థం చేసుకున్నారు! ప్రతిరోజు నా గురించి వారిరువురు తగవులాడు కునేవారు! చివరికి ఒకరోజు కోపం వచ్చి మంగతాయారుగారిని చితగ్గొట్టారు రావుగారు! నా వల్ల ఒక పచ్చని సంసారంలో నిప్పులు కురుస్తున్నాయని పించింది! నామీద మంగతాయారుగారు ఆధారాలు లేని నింద మోపారు, నాకు, రావుగారికి మధ్య ఏ ఆడదీ భరించలేని అక్రమసంబంధాన్ని అంటగట్టారు! నాకిక ఆ ఇంట్లో వుండ మనస్కరించ లేదు! మరో ఇల్లు చూసుకునేంత వరకూ పక్కింటివారు తమ ఇంట్లో వుండ మన్నారు! నాకు అక్కడ పునరావాసం కల్పించింది కూడా రావుగారేనని తరువాత తెలిసింది! రావుగారికి కృతజ్ఞత ఎలా చెప్పుకోవాలో నాకు తెలియ లేదు!

నడిసముద్రంలో వదలిన నావలా నన్ను నా భర్త నిష్కారణంగా వదిలిపెడితే - సాటి మనిషిగా, ఒక సోదరుడిగా రావుగారు నన్ను దరిచేర్చ ప్రయత్నించారు! వారి గురించి నాకు అంతకన్నా ఏమీ తెలియదు! మా ఇద్దరి మధ్య ఎలాంటి సంబంధమూ లేదు! ఇప్పుడు వారెక్కడున్నారో కూడా నాకు తెలియదు! కానీ మిలార్డ్! కేవలం ఒక మగవాడు సానుభూతితో సాటి మనిషికి సహాయం చేసినంత మాత్రాన, వారిమధ్య అసహ్యమైన బంధాలను సృష్టించి, అవహేళన పాలుచేయడం భావ్యమేనా? ఇది న్యాయం జరిగే చోటే అయితే జరిగిన నిజం ఇది! చెప్పండి! మీరే చెప్పండి! తన భర్త వారం రోజులనుంచి కనిపించనంత మాత్రాన, నేనే వారినెక్కడో దాచానని నాపై అపనింద మోపడం ఎంతవరకూ న్యాయమో చెప్పండి? ఒకవేళ మా ఇద్దరి మధ్య అలాంటి సంబంధమే వుంటే, నేను పక్కింట్లోనే, వీరి కళ్ళెదుటే ఎలా ఉండగలనో ఆలోచించండి! నేను లాయరును నియమించలేను? కానీ న్యాయం కావాలి! " ధారావాహికంగా వెలువడుతున్న కన్నీటిని కొంగుతో తుడుచుకుంటూ చేతులెత్తి ప్రాధేయపడింది లక్ష్మి!

ఆవిడ మాటలు అక్కడున్నవారి మనసుల్లో సంచలనాన్ని లేవదీశాయి!

కేసు వాయిదా వేశారు

* * *

"లచ్చిమి! ఓ లచ్చిమి! " విసిరేసిన విస్తరాకులా ఆ వూరికి కాస్త దూరంగా వున్న ఓ గుడిసెముందు అగి కేకేసాడు పోలీస్ పటేల్ రహీం.



పిల్లాడికి పాలిస్తున్న లచ్చిమి ఆ కేకింటూనే.... "ఆఁ!.... వొత్తుండా!" అంటూ పిల్లాడితో పాటు బయటకు వచ్చింది। పోలీస్ పటేల్‌ను చూసి గుండె గతుక్కుమంది।

"దండాలు పటేలా! ఏంది ఈ యేళప్పుదొచ్చిండ్రు!"

రహీం దృష్టి మాత్రం పాలుత్రాగుతున్న పిల్లాడి మీదుంది।

"ఏంది పటేలా! మాట్లాడరయితిరి! అతని చూపులను పసిగట్టిన లచ్చిమి వెనక్కు తిరుగుతూ అంది।

"కుచ్ బి నహీ లచ్‌మి। దొర నిన్ను పిలుచు రమ్మండ్రు!...." తన ప్రవర్తనకు సిగ్గుపడుతూ అన్నాడు రహీం।

దొర పిలిచాడనగానే లచ్చిమి గుండెల్లో గుబులు రేగింది।

"ఎందుకు పటేలా?"

"బోల్‌తేగానీ రావా ఏంది?...." కళ్ళెర్ర చేశాడు రహీం।

"గట్లాకాదు పటేలా! నీ బాంచను! పొద్దు మూకుతోంది। పోరడేడుస్తున్నడు! గిప్పుడేగ్గదా దొరింటికాడి కెళ్ళొచ్చినా! పంచాయితి మళ్ళ రేపుంది

గ్గద ! గిప్పుడు దొరెందుకు పిలిచింద్ర న్నడిగిన....” పిల్లాడిని భుజంమీద వేసుకుంటూ అంది లచ్చిమి !

“అయితే సునో....దొర ఈ రాత్రికి నిన్ను రమ్మంద్రు !....” మబ్బులు ముసురుకుంటున్న దివికేసి చూస్తూ అన్నాడు రహీం !

“అంటేంది పటేలా ! నాకు సమజ్‌కు రాలే. ..” అమాయకంగా ప్రశ్నించింది లచ్చిమి !

“నీకు సమజ్ కాద వస్తది ! అ రంగయ్యగాడితో పండుకోని కొస్తది!”

“పటేలా !... ” రహీం మాటలు పూర్తి కాకముందే పిడుగులా ఘర్జించింది లచ్చిమి !

“ఏంది పటేలా ?... ఊళ్ళందరూ కూసినట్లు మీరు గూడా కూస్తిరా ! ఊరి కయినోళ్ళు గిట్లా మాట్లాడతరేంది పటేలా ?... ” చీదుతూ అంది లచ్చిమి.

లచ్చిమి మాటలు రహీంలో పెద్ద మార్పు తేలేదు ! స్వామి భక్తుడు మరి ! దొర చెప్పినట్లు ఏర్పాటుచేయకపోతే తన క్రిందికి నీళ్ళు వస్తాయని తెలుసు ! అందుకే లచ్చిమితో చివరి ఆయుధాన్ని ప్రయోగించాడు.

“చూడు లచ్చిమి ! నేను నీ మంచి కొరకే సెబుతుండ ! ఈ దొర గురించి నీకింకా తెలీందు ! పులితోలు కప్పుకున్న పిల్లిలాంటి వాడీ దొర ! అళ్ళు జెప్పింది జరక్కపోతే కళ్ళెర్రజేస్తరు ! ఇప్పుడు నువ్వు దొర కోరిక తీరిస్తివనుకో– రేపు తీర్పు నీవైపు జెప్తడు ! లేకుంటే నువ్వీ వూరు వదలి పోవల్సొస్తది ! మగదిక్కు– లేకుండా నీవెక్కడికి బోతవ్ ! ఎలా బతుకుతవ్ ! నా మాటిను ! బాగా సోంచాయించుకుని చెప్పు ! మై ఫిర్ ఆవుంగా ! ” చేతిలో కర్ర త్రిప్పుకుంటూ అక్కడి నుంచి నిష్క్రమించాడు !

లచ్చిమి అలానే ఆలోచిస్తూ కూర్చుంది. చివరికి ఓ నిర్ణయానికి వచ్చిన దానిలా, భుజంమీద నిద్రబోతున్న పిల్లాడిని గుడిసెలో పడుకోబెట్టింది ! ఓసారి తన ముఖం చూసుకుని తనలో తాను పిచ్చిగా నవ్వుకుంది !

తలుపుకు తాళంవేసి, తనవైపే వస్తున్న పోలీస్ పటేల్ రహీంకు ఎదురు వెళ్ళింది ! ఇద్దరూ కలిసి వూరిబయట దొరగారి విశ్రాంతి మందిరంవైపు వెలు తుంటే – కసిగా మసి పూసుకున్న ఆకాశంలో నక్షత్రాలు కూడా కనిపించ లేదు.

* * *

ఆ రోజు కోర్టు హాలంతా జనంతో మరీ కిటకిట లాడిపోతోంది !

గోడగడియారం తన బాధ్యతను నిర్వహించింది !

జడ్జిగారు ఆసీనులవడం, లక్ష్మి యధా విధిగా బోనులోకి రావడం – ఒకేసారి జరిగాయి !




జడ్జిగారి తీర్పు విన్న మరుక్షణంలో పోలీసులు ప్రక్కకు తప్పుకున్నారు।

లక్ష్మి భర్తను నచ్చచెప్పి తీసుకు రావడానికి వెళ్ళిన రంగారావుగారు అవమానం మోసుకొని వచ్చి లక్ష్మికి జామీను నిచ్చారు।

తన చేతిలో బాబు కేరింతాలు కొడుతుంటే – జడ్జిగారి తీర్పు విన్న రంగారావుగారు తృప్తిగా వూపిరి పీల్చుకున్నారు

లక్ష్మి కసిగా తనలో తాను నవ్వుకుంటూ బోసినవ్వులు వెదజల్లుతున్న బాపూజీ వైపు చూడలేక తలదించుకుంది

* * *

రోజులు మారాయి। లచ్చిమి వూరి బయటనుంచి వూర్లోకి వచ్చేసింది। గుడిసె కాస్తా మేడగా మారింది।

అంతవరకూ లచ్చిమిని చీదరించుకున్నవాళ్ళంతా వేనోళ్ళ పొగిడారు.

ఇప్పుడు లచ్చిమి పదెకరాల మాగాణికి యజమానురాలై లచ్చిమి కాస్తా, లక్ష్మిగా మారింది।

రంగయ్య మాత్రం ఇవన్నీ చూస్తూ, చేసేది లేక మౌనం వహించాడు।